క్లుప్తంగా

కాళికాంబదేవికి ప్రత్యేక పూజలు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని గాంధీ చౌక్‌లో వెలసిన శ్రీకాళికాంబ చంద్రశేఖర స్వామి దేవస్థానంలో శుక్రవారం సందర్భంగా కాళికాంబదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి మూలవిరాట్‌కు ఉదయం సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం అనంతరం పట్టువస్త్రాలతో అలంకరించారు. అమ్మవారికి ఒడి బియ్యం కార్యక్రమం చేపట్టి మహామంగళ హారతులు ఇచ్చారు.

సర్వేయర్‌గా స్వరూప

శిరివెళ్ల: మండల సర్వేయర్‌గా స్వరూప నియమితులయ్యారు. గత సర్వేయర్ సరిత కొలిమిగుండ్లకు బదిలీ కావడంతో ఈ నియామకం జరిగింది. నూతన సర్వేయర్ నంద్యాల ఏడీ కార్యాలయం నుంచి బదిలీపై వచ్చారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

శిరివెళ్ల: వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం తెలిపారు. యర్రగుంట్ల మేజర్ గ్రామ పంచాయతీలో జరిగిన ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని పరిశీలించారు. వైద్య, పంచాయతీ సిబ్బంది పారిశుద్ధ్యం, తాగునీటిపై ప్రజలకు అవగాహన కల్పించారు. కుళాయిలు, వాటర్ ట్యాంక్‌లను శుభ్రం చేసి, క్లోరినేషన్ చేయాలని ఆదేశించారు. ఈఓ వెంకటేశ్వర్లు,సర్పంచు సుభహాన్, ఈఓఆర్డీ నాగరాజు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించండి

ఉయ్యాలవాడ: జగనన్న కాలనీలో గృహాలు మంజూరైన లబ్ధిదారులు నిర్మాణాలు ప్రారంభించాలని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు కోరారు. శుక్రవారం మండలంలోని ఆర్.పాంపల్లె గ్రామంలోని జగనన్న కాలనీని సందర్శించారు. 43 మందికి ప్రభుత్వం గృహాలు నిర్మించుకునేందుకు అనుమతి మంజూరు చేసిందన్నారు. నిర్మాణాలు ప్రారంభిస్తే వివిధ దశల్లో బిల్లులు ప్రభుత్వం మీ వ్యక్తిగత ఖాతాల్లో జమ చేస్తుందని హౌసింగ్ ఏఈ నరసింహరావు తెలిపారు. మౌలిక వసతుల్లో భాగంగా నీరు, రహదారుల ఏర్పాటుకు కృషి చేస్తామని గ్రామ ఉప సర్పంచ్ కందుల వెంకటసుబ్బారెడ్డి చెప్పారు. వర్క్ ఇన్‌స్పెక్టర్ షాదిక్‌బాషా, ఇంజినీరింగ్ అసిస్టెంటు భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలందించాలి

దొర్నిపాడు: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వైద్యం కోసం వచ్చే వారికి మెరుగైన వైద్య సేవలు అందిచాలని డాక్టర్ నాగేంద్ర సూచించారు. శుక్రవారం స్థానిక పీహెచ్‌సీలో వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన ఎన్‌సీడీసీడీ కార్యక్రమం, డయేరియా, మలేరియా పక్షోత్సవాలు, ఎంఆర్, రొటీన్ వ్యాక్సినేషన్‌పై చర్చించారు. అలాగే డ్రైడే, ఫ్రైడే అనీమియ ముక్తభారత్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులు, కిశోరబాలికలకు రక్తపరీక్షలు, హైరిస్క్ గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు.

సచివాలయం తనిఖీ

చాగలమర్రి: సచివాలయానికి వివిధ సమస్యలతో వచ్చే ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలనిఎంపీడీఓ మహబూబ్ దౌలా సూచించారు.శుక్రవారం స్థానిక – 1,5వ వార్డు సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. సచివాలయ పరిధిలో అందించే వివిధ సేవల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.స్పందన కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. ఆయన వెంట ఇన్‌చార్జ్ ఈఓఆర్డీ సుదర్శనరావు ఉన్నారు.

చర్యలు తీసుకోవాలి

నంద్యాల(న్యూటౌన్): డీటీడబ్ల్యూఓ హుసేనయ్యపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ధనుంజయుడు కోరారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలోనున్న ట్రైబల్ స్కూళ్లు, హాస్టల్ వ్యవస్థను అధ్వానంగా మార్చిన హుసేనయ్యపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థులను అసభ్యకరంగా మాట్లాడుతున్న వార్డెన్ వెంకటేశ్వరమ్మపై కూడా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇప్పటికే ఐదుసార్లు స్పందనలో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. పట్టణ కార్యదర్శి మనోహర్, లోకేష్, చంద్ర, రమణ పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ

దొర్నిపాడు: ప్రస్తుతం డిజిటల్ లావాదేవీలు అధికంగా జరుగుతున్నాయని, ఈ క్రమంలో సైబర్ నేరాలు అధికమయ్యాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ తిరుపాల్ సూచించారు. శుక్రవారం రాత్రి మండలంలోని బుర్రారెడ్డిపల్లె గ్రామంలో పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. ముందుగా గ్రామస్తులతో సమావేశం నిర్వహించి ప్రధాన కూడళ్లు, కార్యాలయాలు. ఆలయాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. ఆన్‌లైన్‌లో రుణాల పేరుతో ఫేక్ యాప్స్ వలలో పడి మోసపోవద్దన్నారు.

జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ

ఆళ్లగడ్డ: యంగ్‌ముడో క్రీడలో స్థానిక వైపీపీఎం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయిలో ప్రతిభ చాటారు. ఈ నెల 10, 11 తేదీల్లో గోవా రాష్ట్రంలో జాతీయ స్థాయి పోటీలు జరిగాయి. ఇందులో శౌరిజాక్ష బంగారు పతకం, ఆస్మిక, శ్రీలక్ష్మి వెండి పతకాలు పొందారు. విద్యార్థులతో పాటు కోచ్ ఓబులేసును హెచ్‌ఎం వెంకట్రామిరెడ్డి, ఉపాధ్యాయులు శుక్రవారం అభినందించారు.

పింఛన్ తీసుకుంటున్నా..



వృద్ధులకు గతంలో 65 సంవత్సరాలకు పింఛన్ వచ్చేది. వైఎస్ జగన్ వచ్చిన తరువాత 60 ఏళ్లకు తగ్గించారు. నేను 18 నెలలుగా పింఛన్ తీసుకుంటున్నా. గతంలో పింఛన్ మంజూరుకు కార్యాలయాల చుట్టూ కాళ్లు అరిగేలా తిరగాల్సి వచ్చేది. ప్రస్తుతం గ్రామంలోని సచివాలయాల ద్వారానే మంజూరు చేసి ప్రతి నెల వారే ఇంటికి వచ్చి సొమ్ము అందజేస్తుండటంతో నడవలేని, వృద్ధులు, దివ్యాంగులు, రోగులకు ఇబ్బందులు తప్పించారు. కుల వృత్తి అయిన కుండలు తయారు చేసుకొని జీవనం సాగిస్తుండే వాడిని పింఛన్ సొమ్ము నెలనెలా వస్తుండటంతో ఉపాధి ద్వారా ఆదాయం తగ్గినా ఆసరాగా ఉంటుంది.

-వెంకటస్వామి, జూలేపల్లె

గతంలో ఎన్ని సార్లు తిరిగినా పింఛన్ ఇవ్వలేదు



నా పేరు పెద్ద మద్దిలేటి, మాది గోస్పాడు మండలం యాళ్లూరు. డప్పు కొడుతూ జీవనం సాగిస్తున్నాం. డప్పు కళాకారులకు పింఛన్ ఇవ్వాలని గతంలో ఎన్నో సార్లు కార్యాలయాల చుట్టూ దరఖాస్తులు పట్టుకొని తిరిగినా మంజూరు కాలేదు. జగనన్న సీఎం అయిన తరువాత గ్రామంలో మా ఇంటికి వచ్చి దరఖాస్తు తీసుకున్నారు. ఇప్పుడు నెలకు రూ.3వేల పింఛన్ అందిస్తున్నారు. అలాగే రైతు భరోసా పథకం కింద మా కుటుంబానికి రూ.13,500 అందుతుంది. వైఎస్సార్ చేయూత ద్వారా నా భార్యకు ఏటా రూ.18,750 ప్రకారం మూడుళ్లు అందింది. నా కుమారుడు వలంటీర్‌గా పని చేస్తూ కుటుంబానికి ఆసరాగా నిలుస్తున్నాడు. రాజన్న కొడుకు వచ్చిన తరువాతే మేం బాగా బతకగలుగుతున్నాం.

రూ.1.50 లక్షలు లబ్ధి చేకూరింది



నా పేరు సుశీలమ్మ. మాది పసురపాడు గ్రామం. వసంత పొదుపు లక్ష్మి గ్రూపులో సభ్యురాలిని. జగనన్న అమలు చేసిన పథకాలతో మా కుటుంబానికి ఎంతో మేలు జరిగింది. వైఎస్సార్ ఆసరా కింద మా గ్రూపునకు ఏడాదికి రూ.60,719తో పాటు అమ్మ ఒడి కింద ఏడాదికి రూ.15వేలు, వాహన మిత్ర కింద రూ.10వేలు, రైతు భరోసా కింద రూ.13,500 లబ్ధి పొందుతున్నాం. స్త్రీనిధి ద్వారా రూ.50వేలు తీసుకొని కిరాణ షాపు ఏర్పాటు చేసుకొని జీవనం ఆనందంగా సాగిస్తున్నాను. పథకాలతో మా కుటుంబానికి ఆర్థిక అవస్థలు తప్పాయి.

‘సంక్షేమ’ నిలయాలు

- నంద్యాల నియోజకవర్గంలో 34 గ్రామ, వార్డు సచివాలయాల ఏర్పాటు
- భవనాల నిర్మాణానికి రూ.12.95 కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం
- జగనన్న పథకాలతో లబ్ధిదారులు పొందిన లబ్ధి రూ.360 కోట్లు



చాబోలు గ్రామంలో షేక్ రహిమున్‌బీకి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ ముస్తాక్ బాషా(ఫైల్)

గోస్పాడు: పల్లెసీమల అభివృద్ధికి, గ్రామీణులకు పాలన మరింత చేరువ చేసేందుకు, ప్రజల సమస్యలకు ఊర్లోనే పరిష్కారం లభించేందుకు, సంక్షేమ పథకాలకు అర్హులను ఎంపిక చేయడం.. తదితర వాటన్నింటికీ ఒక పరిపాలన కేంద్రం ఉండాలని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిర్ణయించింది. ఆ కేంద్రమే గ్రామ/ వార్డు సచివాలయం. ముఖ్యంగా ప్రభుత్వ సేవలు, పథకాలు సకాలంలో అందజేయడంలో సచివాలయాలది కీలక భూమిక. నిజమైన పేదలకు పథకాలు అందజేయడంలో కీలకంగా మారింది. గాంధీజీ ఆశయ సాధనలో భాగంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన ఈ వ్యవస్థ ఎంతో పేరు ప్రఖ్యాతలు పొందింది.

34 సచివాలయాలు ఏర్పాటు..

గోస్పాడు మండలంలో 12 సచివాలయాలను ఏర్పాటు చేశారు. వీటికి నూతన భవనాల ఏర్పాటుకు గ్రామాల వారీగా నిధులు మంజూరు చేసింది. ఇందులో భాగంగా.. దీబగుంట్లకు రూ.25లక్షలు, నెహ్రూనగర్, గోస్పాడు గ్రామాల్లో ఒక్కొక్క సచివాలయ ఏర్పాటుకు రూ.35 లక్షలు, మిగిలిన 8 సచివాలయాలకు రూ.40లక్షల చొప్పున నిధులు మంజూరు చేసి ఏర్పాటు చేశారు. అలాగే నంద్యాల మండలంలో 22 సచివాయలు ఏర్పాటు చేశారు. వాటిలో అయ్యలూరు వన్ రూ.25 లక్షలు, పెద్దకొట్టాల, రైతునగరం–1 సచివాలయాల కోసం రూ.35 లక్షలు, మిగిలిన సచివాలయాలకు రూ.40 లక్షల చొప్పున నిధులు విడుదల చేశారు. వీటిల్లో 14 మంది ఉద్యోగులను నియమించి వీటికి అనుసంధానంగా 50 కుటుంబాలకు ఒక వలంటీర్‌ను నియమించారు. దీంతో ప్రజల గడప వద్దకే సేవలతో పాటు సంక్షేమ పథకాలు అందేలా చర్యలు చేపట్టింది.

ప్రజల సమస్య పరిష్కారమే..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతి 2వేల జనాభాకు ఒక సచివాలయాన్ని ఏర్పాటు చేసింది. అలాగే దీనికి అనుబంధంగా వలంటీర్ వ్యవస్థ ఏర్పాటు చేసి పథకాల అమలులో పారదర్శకతో పాటు, అర్హులు మాత్రమే లబ్ధి పొందేలా పటిష్ట ప్రణాళిక రూపొందించింది. గతంలో పింఛన్ల కోసం రోజుల తరబడి కార్యాలయాల వద్దకు తిరిగే పని లేకుండా ఇళ్ల వద్దకే వచ్చి అందించేలా ఏర్పాటు చేసింది. గతంలో అధికారులు, ప్రజాప్రతినిధులు గ్రామాలకు ఎప్పుడో ఒక సారి చుట్టపుచూపుగా వచ్చిపోయేవారు. ప్రస్తుతం నిత్యం ప్రజల్లోనే ఉండేలా నిబంధనలు రూపొందించింది. దీంతో ప్రజల సమస్యలు ఎప్పటికప్పుడు వేగంగా పరిష్కారమవుతున్నాయి.



దీబగుంట్లలో ఏర్పాటు చేసిన సచివాలయ భవనం

సచివాలయం ద్వారా ప్రజలకు అవసరమైన 543 రకాల సేవలు అందిస్తున్నారు. ఒక్కొక్క సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి, వీఆర్‌ఓ, ఇంజినీరింగ్ అసిస్టెంట్, అగ్రికల్చర్, పశుసంవర్ధక శాఖ, మహిళా పోలీసులు, వెల్ఫేర్, తదితర 14మంది వివిధ ప్రభుత్వ శాఖలకు అనుబంధంగా నియమించింది. సమస్యతో సచివాలయానికి వస్తే నిర్ణీత వ్యవధిలో సంబంధిత సేవలు అందించాలని కార్యాచరణ ప్రణాళిక, నిబంధనలు పటిష్టంగా అమలు చేస్తుండటంతో 15 నిమిషాల నుంచి 72 గంటల్లో సమస్యలు పరిష్కారమతున్నాయి. నవరత్నాలకు సంబంధించిన పింఛన్ల, అర్హులైన అందరికీ ఇళ్లు, వైఎస్సార్ చేయూత, చేదోడు, వైఎస్సార్ ఆసరా, మ్యూటేషన్, ఇళ్లు, భూముల రీసర్వే, జనన,మరణ ధ్రువీకరణ పత్రాలు, వైఎస్సార్ బీమా, రేషన్‌కార్డులు వంటివి నేరుగా లబ్ధిదారులకు అందజేస్తున్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ ఫలాలు అందిస్తుండటంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అంతేగాక గ్రామాల అభివృద్ధి కోసం అంతర్గత రహదారులకు సీసీ రోడ్ల ఏర్పాటు, దీబగుంట్ల నుంచి కానాలపల్లె వరకు, కానాలపల్లె నుంచి మెట్ట వరకు దీబగుంట్ల నుంచి బోయలకుంట్ల మెట్ట వరకు తారు రోడ్డు ఏర్పాటుకు రూ.5కోట్లు ఖర్చు చేసింది.

పథకాల ద్వారా లబ్ధి పొందిన వారి వివరాలు..

గోస్పాడు మండలంలో..

- 12 సచివాయ భవనాల ఏర్పాటుకు రూ.4.15 కోట్లు మంజూరు
- నాలుగేళ్లలో పథకాల ద్వారా లబ్ధి పొందిన వారు 52,179
- లబ్ధిదారులు పొందిన మొత్తం లబ్ధి రూ.123 కోట్లు
- వైఎస్సార్ ఆసరాతో లబ్ధి పొందిన గ్రూపులు 808
- మహిళలకు అందిన మొత్తం రూ.17 కోట్లు
- పింఛన్‌దారుల సంఖ్య – 5,452
- అందుతున్న పింఛన్‌సొమ్ము రూ.1.46 కోట్లు
- మంజూరైన ఇళ్లు 1,250, ఇందులో 370 పూర్తి
- ఇళ్ల లబ్ధిదారుల ఖాతాలో జమైన మొత్తం రూ.7.56కోట్లు

నంద్యాల మండలంలో..

- 22 సచివాలయాల ఏర్పాటుకు రూ. 8.80 కోట్లు
- పథకాల లబ్ధిదారుల సంఖ్య 1,02,136
- వారు పొందిన మొత్తం లబ్ధి రూ.237.337 కోట్లు
- వైఎస్సార్ ఆసరాలో లబ్ధి పొందిన గ్రూపులు 1,194
- మహిళలకు చేకూరిన లబ్ధి రూ.28.98 కోట్లు
- పింఛన్ దారుల సంఖ్య 8,556
- తీసుకున్న పింఛన్ సొమ్ము రూ.2.36 కోట్లు
- ఇళ్లు మంజూరైనవి 1704, ఇందులో 560 ఇళ్లు పూర్తయ్యాయి.
- ఇళ్ల లబ్ధిదారుల ఖాతాలో జమైన మొత్తం రూ.10.60 కోట్లు

డ్రగ్స్‌పై అవగాహన

నంద్యాల(న్యూటౌన్): స్థానిక పీఎస్సీ కేవీఎస్సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ గంగన్న ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ శశికళ అధ్యక్షతన శుక్రవారం డ్రగ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సెబ్ సబ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మి హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ చేయాలని ప్రభుత్వం లక్ష్యం నిర్దేశించుకుందన్నారు. యువత మేల్కో.. భవిత మలుచుకో.. డ్రగ్స్‌ను వదులుకో అనే నినాదంతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. విద్యార్థులు ఉండే ప్రాంతాల్లో కానీ, విద్యాసంస్థల్లోగాని గంజాయి, కొకైన్, హెరాయిన్ లాంటి మత్తు పదార్థాలు వాడినా, అందజేసినా తమకు తెలియజేయాలన్నారు. టోల్‌ఫ్రీ నంబర్.14500కు ఫోన్ చేస్తే మీ పేరు గోప్యంగా ఉంచుతామని చెప్పారు.



మాట్లాడుతున్న సెబ్ సీఐ లక్ష్మి

నిరసనను జయప్రదం చేయండి

నంద్యాల(న్యూటౌన్): కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై ఆగస్టు 9న దేశ వ్యాప్తంగా జరిగే నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మునెప్ప పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 9సంవత్సరాలలో ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. దేశాన్ని కార్పొరేట్ శక్తులకు అమ్మాలని ప్రయత్నిస్తోందని విమర్శించారు. ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలన్నారు. పెట్రోల్, డీజల్, నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరుగుతున్నా కేంద్రప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, బాబాఫకృద్దీన్, నాగిరెడ్డి, రమేష్‌బాబు, బాలకృష్ణ, శ్రీనివాసులు, భాస్కర్ పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

రుద్రవరం: సరైన ధ్రువ పత్రాలు లేని వాహనాలకు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రవిశంకర్‌నాయక్ జరిమానా విధించారు. మండల కేంద్రం వైపు శుక్రవారం ఆయన వాహనాల తనిఖీ చేపట్టారు. ఇందులో బండలు తరలించే ట్రాక్టర్‌తో పాటు మరో ట్రాక్టర్‌కు దాదాపు రూ.25వేల జరిమానా విధించామని ఎంవీఐ చెప్పారు. జరిమాన చెల్లించే వరకు వాహనాలను స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోండి

నంద్యాల(అర్బన్): పాణ్యం మండలం కౌలూరు పంచాయతీ కార్యదర్శిపై చర్యలు చేపట్టాలని దళిత బహుజన సంఘాల గౌరవాధ్యక్షుడు లింగస్వామి కోరారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం పలు ప్రజా సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సచివాలయం ముందున్న స్థలంలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు గ్రామ సభలో పంచాయతీ తీర్మానం చేశారన్నారు. అయితే పంచాయతీ కార్యదర్శి సులోచన విగ్రహం ఏర్పాటుకు అడ్డంకులు సృష్టిస్తోందని మండిపడ్డారు. దండోర నాయకులు వెంకటసుబ్బయ్య, న్యాయవాది బాలస్వామి, దేవదత్తు, తిరుపతి, చంద్రపాల్ పాల్గొన్నారు.

గుర్తింపు రద్దు చేయాలి

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని గుడ్‌షెప్పర్డ్ స్కూల్ పాఠశాల గుర్తింపు రద్దు చేయాలని కోరుతూ రాయలసీమ విద్యార్థి యువజన సంఘాల జేఏసీ నంద్యాల చైర్మన్ రాజునాయుడు డీఈఓ సుధాకర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ అక్రమ ఫీజులు, రకరకాల పేర్లతో దోపిడీ చేస్తూ ధనార్జనే ధ్యేయంగా నడుస్తున్న పాఠశాల గుర్తింపు రద్దు చేయాలన్నారు. ధనుంజయుడు, శివకృష్ణ, మహేష్ పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

ఆళ్లగడ్డ: అక్రమంగా ఆటోలో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని ఓబుళంపల్లి గ్రామ సమీపంలో స్వాధీనం చేసుకున్నామని రూరల్ ఎస్‌ఐ నరసింహులు శుక్రవారం తెలిపారు. బియ్యం అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారం మేరకు దాడులు నిర్వహించగా మౌలాలి అనే వ్యక్తి నుంచి 8.10 క్వింటాళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

ఎస్‌ఐకి సన్మానం

ఆళ్లగడ్డ: పట్టణ ఎస్‌ఐగా పనిచేసి కర్నూలు జిల్లా నాగలాపురం స్టేషన్‌కు బదిలీపై వెళ్తున్న ఎస్‌ఐ తిమ్మయ్యకు వీడ్కోలు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశానికి ఆళ్లగడ్డ డీఎస్పీ వెంకట్రామయ్య ముఖ్యఅతిథిగా హాజరై తిమ్మయ్యను సన్మానించారు. సీఐ రమేష్‌బాబు, ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.



ఎస్‌ఐ తిమ్మయ్యను సన్మానిస్తున్న డీఎస్పీ వెంకటరామయ్య, సిబ్బంది

క్యాన్సర్ శస్త్ర చికిత్సపై అవగాహన

నంద్యాలటౌన్: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నంద్యాల శాఖ ఆధ్వర్యంలో స్థానిక సూరజ్ హోటల్‌లో హైదరాబాద్ యశోద ఆసుపత్రి సహకారంతో నంద్యాల వైద్యులకు క్యాన్సర్ శస్త్ర చికిత్సలో రోబోటిక్ విధానాలు, గుండె జబ్బులు, ఊపిరితిత్తుల సమస్యలపై అధునాతన వైద్య విధానాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ వైద్య చికిత్సలో వస్తున్న మార్పులపై వైద్యులు ఎప్పటికప్పుడు పరిజ్ఞానం పెంచుకోవాలని సూచించారు. అనంతరం హైదరాబాద్ యశోద ఆసుపత్రి వైద్యులు గురుప్రకాశ్, విశ్వేశ్వరన్, జయంత్ చికిత్స విధానాలపై వైద్యులకు అవగాహన కల్పించారు. డాక్టర్లు అనిల్ కుమార్, సహదేవుడు, మధుసూదనరావు పాల్గొరన్నారు.

రెస్టారెంట్ లీజు చెక్కు కలెక్టర్‌కు అందజేత

నంద్యాల(అర్బన్): కొత్తపల్లి మండలం సంగమేశ్వరం వద్ద గల పర్యాటక శాఖ రెస్టారెంట్‌కు సంబంధించిన అడ్వాన్స్ లీజు నగదు రూ.2,57,240 చెక్కును శుక్రవారం జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్‌కు అందజేశారు. ఈనెల 15న పర్యాటక శాఖ కార్యాలయంలో నిర్వహించిన రెస్టారెంట్ లీజు వేలం పాటలో వెంకటరమణ దక్కించుకున్నాడు. అందుకు సంబంధించిన నగదును జిల్లా కలెక్టర్, జిల్లా పర్యాటక మండలి చైర్మన్‌కు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా పర్యాటక, సాంస్కృతిక శాఖ అధికారి సత్యనారాయణ ఉన్నారు.

దరఖాస్తు చేసుకోండి

చాగలమర్రి: మండలంలో ఖాళీగా వున్న 3 యండీయూ (రేషన్ బియ్యం పంపిణీ చేయుటకు) ఉద్యోగాలకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్ విజయ్ కుమార్ తెలిపారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని కెయల్ 3900–1 వాహనం చిన్న వంగలి, పెద్ద వంగలి గ్రామాలకు –బీసీ, కెయల్ 3900–3 వాహనం గొడిగనూరు, డి.వనిపెంట గ్రామాలకు –బీసీ, కెయల్ 3900–5 వాహనం పెద్దబోధనం, చిన్నబోధనం గ్రామాలకు–ఎస్సీ కేటగిరీల వారిగా ఖాళీలున్నాయన్నారు. అభ్యర్థులు పదో తరగతి ఉత్తీర్ణులై, డ్రైవింగ్ లైసెన్సు కలిగి, 20 సంవత్సరాలకు పైగా వయస్సు కలిగి, ఆయా కేటగిరీలకు చెందిన వారు ధ్రువ పత్రాలతో దరఖాస్తులను కార్యాలయంలో అందజేయాలని, ఇందుకు ఈనెల 21వ తేదీ వరకు గడువుందని వివరించారు.

ముగిసిన ఆధ్యాత్మిక ప్రవచనాలు

నంద్యాల(వ్యవసాయం): స్థానిక సంజీవనగర్‌లోని శ్రీ ఉమామహేశ్వర ఆశ్రమంలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక ప్రవచన కార్యక్రమం శుక్రవారం ముగిసింది. శ్రీ శంకరానంద గిరి గురుస్వాముల వారి 104వ జయంతిని పురస్కరించుకొని శ్రేయానంద మాతాజీ ఆది శంకరాచార్యులు రచించిన మనిషా పంచకం, భగవద్గీతలోని 13వ అధ్యాయం గురించి భక్తులకు వివరించారు. సాయంత్రం శ్రీ విష్ణు సహస్రనామ పారాయణం, శ్రీశంకరానంద గిరి అష్టోత్తర శతనామావళి పూజా కార్యక్రమాలు నిర్వహించి మహా మంగళ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

స్థలాలు, ఇళ్లు మంజూరు చేయాలి

నంద్యాల(న్యూటౌన్): మున్సిపల్ పర్మినెంట్ వర్కర్స్‌కు ఇళ్ల స్థలాలు ఇచ్చి గృహాల నిర్మించి ఇవ్వాలని కార్మికులు, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు కె.ప్రసాద్ కోరారు. శుక్రవారం మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డికి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ గతంలో మున్సిపల్ అధికారులు 96 మందికి క్వార్టర్స్ ఇచ్చారని, మిగతా 58 మందికి ఇవ్వలేదన్నారు. బాడుగులు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు, సోమన్న, కోటయ్య పాల్గొన్నారు.

నిర్ణీత ధరకే మద్యం విక్రయించాలి

గోస్పాడు: ప్రభుత్వం నిర్దేశించిన ధరకే మద్యం విక్రయించాలని నంద్యాల జిల్లా ఎక్సైజ్ అధికారి రవికుమార్‌రెడ్డి సూచించారు. యాళ్లూరు, కామినేనిపల్లె గ్రామాల్లో ప్రభుత్వ మద్యం దుకాణాలను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ అమ్మకాలకు సంబంధించిన విధి విధానాలపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. అన్ని మద్యం దుకాణాల్లో డిజిటల్ లావాదేవీలు, స్వైపింగ్ పేమెంట్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎక్సైజ్ సిబ్బంది అస్లాంబేగ్, నాగరాజు పాల్గొన్నారు.

శిరివెళ్ల: గోవిందపల్లెలోనున్న ప్రభుత్వ మద్యం దుకాణాన్ని జిల్లా ఎక్సైజ్ అధికారి రవికుమార్ రెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు. మద్యం బాటిళ్ల నిల్వలు, అమ్మకాలు, రేట్ల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ డిజిట్ పేమెంట్ సౌకర్యం అందుబాటులోకి తెచ్చామని, దుకాణాలకు స్వైపింగ్ మిషన్లు అందజేశామన్నారు. వాటిపై అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు.

తోటల పెంపకానికి ప్రభుత్వ ప్రోత్సాహం

ఉయ్యాలవాడ: ఉపాధి హామీ పథకం కింద పండ్ల తోటలు సాగు చేసుకునేందుకు సన్న, చిన్నకారు రైతులకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తుందని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు తెలిపారు. శుక్రవారం మండలంలోని పెద్దయమ్మనూరు గ్రామ సచివాలయంలో పండ్ల తోటల పెంపకంపై రైతులకు అవగాహన కల్పించారు. 5 ఎకరాల్లోపున్న రైతులు మామిడి, చీనీ, జామ, నిమ్మ, సపోటా, దానిమ్మ, కొబ్బరి, మునగ, సీతాఫలం, చింత, డ్రాగన్ ఫ్రూట్స్ సాగు చేసుకోవచ్చన్నారు. ప్రభుత్వం వంద శాతం సబ్సిడీ కింద ఎకరాకు రూ. 90 వేల నుంచి రూ.1.10 లక్షల వరకు సాగు నిర్వహణ నిమిత్తం మూడు సంవత్సరాల పాటు అందిస్తుందని చెప్పారు. 12 ఎకరాల్లో సాగు చేసేందుకు రైతు లు ముందుకు వచ్చారని ఏపీఓ రవిప్రకాష్ పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శి నూర్‌బాషా పాల్గొన్నారు.

అనారోగ్యంతో వీఆర్‌ఏ మృతి

ఉయ్యాలవాడ: మండలంలోని సర్వాయిపల్లె గ్రామానికి చెందిన వీఆర్‌ఏ అయ్యన్నగారి వెంకటరాముడు (71) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఆర్‌ఐ సత్తార్, తలారుల సంఘం అధ్యక్షుడు అల్లాబకాష్, వీఆర్‌ఓలు వేణుగోపాల్, ఓబులేస్, నరసింహారెడ్డి గ్రామానికి చేరుకుని మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. మృతి పట్ల సానుభూతి వెలిబుచ్చారు. అంత్యక్రియల నిమిత్తం ప్రభుత్వం అందిస్తున్న రూ.15 వేలతో పాటు గ్రామ రెవెన్యూ సహాయకుల తరపున రూ. 5వేలు మృతుడి భార్య నాగమ్మకు అందజేశారు.

హిజ్రాల మధ్య ఘర్షణ

బొమ్మలసత్రం: భిక్షాటన విషయంలో రెండు హిజ్రాల వర్గాల మధ్య చెలరేగిన ఘర్షణలో ఒకరిపై మరొకరు దాడి చేసుకున్న సంఘటన గాజులపల్లి గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. అవుట్ పోస్ట్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రైలులో భిక్షాటన చేసే సమయంలో ప్రకాశం జిల్లా గిద్దలూరు వద్ద రెండు వర్గాలు ఘర్షణకు దిగాయి. గాజులపల్లి తెలుగుగంగ కట్ట వద్ద రెండు వర్గాలు ఒకరిపై మరొకరు దాడి చేసుకున్నారు. దీంతో విమల అనే హిజ్రాకు గాయాలయ్యాయి. మహానంది పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మెనూ అమలులో సమస్యలు పరిష్కరించండి

నంద్యాల(అర్బన్): ప్రభుత్వ వసతి గృహ కళాశాల విద్యార్థులు, ప్రీ మెట్రిక్ హాస్టల్ విద్యార్థులకు ఇస్తున్న మెనూ అమలులో నెలకొన్న సమస్యను పరిష్కరించాలని వసతి గృహ సంక్షేమ అధికారుల సంఘం నాయకులు శ్రీనివాసులు, జలీల్ కోరారు. జీవో ఎంఎస్ నంబరు 8 ప్రకారం మెనూ అమలు చేయడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్లి పరిష్కరించాలని శుక్రవారం ఎస్సీ సంక్షేమ సాధికారత అధికారి చింతామణికి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ కళాశాల హాస్టల్ విద్యార్థికి రూ.1600, ప్రీ మెట్రిక్ విద్యార్థికి రూ.1400 ప్రకారం పెంచారన్నారు. జీఓ ఒక్కో విద్యార్థికి రూ.53.33 కేటాయించారని, అయితే నంద్యాల డీపీసీ రేట్లతో పోల్చితే ఒక రోజుకు విద్యార్థికి రూ.71.05 ఖర్చు అవుతుందని, అంటే దాదాపు రూ.17.72 అదనంగా వసతి గృహ సంక్షేమ అధికారి భరించాల్సి వస్తుందన్నారు. దాదాపు వంద మంది విద్యార్థులు ఉంటే నెల మొత్తానికి దాదాపు రూ.53వేలు అదనంగా భరించాల్సి ఉందన్నారు. వార్డెన్లు శంకరయ్య, కాశింసాహెబ్ పాల్గొన్నారు.



చింతామణికి వినతి పత్రం ఇస్తున్న జిల్లా వసతి గృహ సంక్షేమ అధికారుల సంఘం నాయకులు

భానుడితో ధరల పోటీ

- కూరగాయలు, చికెన్ ధరలపై ఎండ ప్రభావం
- కిలో చికెన్ రూ.320 దాటుతున్న వైనం
- కిలో రూ.80 చేరిన పచ్చి మిర్చి
- రూ.60 పలుకుతున్న టమాట
- రూ.90 దాటిన బీన్స్

దొర్నిపాడు: జూన్ నెల మూడో వారం వచ్చినా భానుడి భగభగలు కొనసాగుతుండటంతో కూరగాయలు, చికెన్ ధరలు ఎండలతో పోటీపడుతున్నాయి. అధిక ఉష్ణోగ్రతల కారణంగా కూరగాయల దిగుబడులు క్షీణించడంతో ధరలు పెరిగాయి. పచ్చిమిర్చి పప్పు, కాకర చేదు, టమాట చారు రుచులను చూడటం ప్రజలకు కష్టతరమవుతుంది.

కిలో రూ.50పైమాటే.. పచ్చిమిర్చి ధర కిలో రూ.80 ఉంటే , కాకర కాకర రూ.70 పలుకుతోంది. అలాగే టమాట రూ.10 ఉండగా ప్రస్తుతం రూ.60కి చేరగా, వంకాయ రూ.60 చేరింది. ఇక అల్లం కిలో రూ.550కి చేరి మహాప్రియంగా మారింది. బీరకాయ, చిక్కుడు, బెండ, క్యారెట్, బీట్ రూట్ రూ.60 ప్రకారం విక్రయిస్తున్నారు. ఇక బీన్స్ రూ.90 చెబుతున్నారు.

రైతులకు లాభాలు అంతంత మాత్రమే..

కూరగాయల ధరలు పెరిగితే రైతుకు మంచిదే అనుకుంటే కారెట్‌లో కాలేసినట్లే..రైతు వద్ద కిలో పచ్చిమిర్చి రూ.30 నుంచి రూ.40 ప్రకారం కొనుగోలు చేసిన దళారులు మార్కెట్లో మాత్రం రూ.80 ప్రకారం విక్రయించుకుంటున్నారు.

కొండెక్కిన కోడి..

చికెన్ ప్రస్తుతం కిలో రూ.320 నుంచి రూ.340 వరకు పలుకుతోంది. దీంతో మాంసం ప్రియులు ఇబ్బందులు పడుతున్నారు. వ్యాపారాలు పడిపోతుండటంతో కొందరు వ్యాపారులు కిలో రూ.300 అని బోర్డు పెట్టినప్పటికీ కొనుగోలుదారులు రావడం లేదని వాపోతున్నారు.

అధిక ఎండలతో పెరిగిన చికెన్ ధరలు



అధిక ఎండలతో కోళ్ల ఉత్పత్తి చాలా వరకు తగ్గడంతో పాటు చనిపోతుండటంతో ధరలు అమాంతం పెరిగాయి. పెరిగిన ధరలతో వారంలో ఒక రోజు కూడా ముక్క ముట్టలేకపోతున్నాం. కిలో రూ.300 పైగా వెచ్చించి పెట్టి కొనాలంటే ఇబ్బందికరంగానే ఉంది.

– బత్తుల క్రిష్ణయ్య, దొర్నిపాడు

చింతపండు పులుసు మేలు



కూరగాయలు కొనాలంటే భయమేస్తుంది. దీంతో పప్పుచారు, చింతపండు పులుసే నయం అనేలా ఉంది. ఎండలు తీవ్రంగా ఉండటంతో పంటలు సరిగ్గా పండలేదని, దిగుమతి చేసుకుంటుడటంతో రవాణా ఖర్చులు పెరుగుతున్నాయని వ్యాపారులు చెబుతున్నారు.

– స్వర్ణలత,గృహిణి, దబ్బ్యా.గోవిందిన్నె